శ్రీరామచంద్ర గ్రంథమాల.  నవమ పుష్పము

శ్రీరస్తు

శ్రీ శ్రీ శ్రీ సుబ్రహ్మణ్య సద్గురు పరబ్రహ్మణేనమః

# శ్రీ సుబ్రహ్మణ్య శతకము




రచయిత:

ఉభయభాషాప్రవీణ

లింగాల సూర్యనారాయణ



ఈ గ్రంథము మునుకుట్ల వెంకటేశ్వర్లుగారి దత్తపుత్రులైన

మునుకుట్ల విశ్వనాథం గారి

ద్రవ్యసహాయమున ముద్రింపఁబడియె.

[ మొదటి కూర్పు 500 ]

1948



కాపీరైటు

అన్నిహక్కులు గ్రంథకర్తవి


వెల 0-3-0


Scanned with CamScanner

శ్రీ ర స్తు
శ్రీ శ్రీ శ్రీ సుబ్రహ్మణ్య సద్గురు పరబ్రహ్మణేనమః

# వి జ్ఞ ప్తి.

క. ఎప్పుడు ధర్మక్షయమగు
నెప్పుడు పాపంబులొదవు, నీ లోకములో
నప్పుడు విశ్వేశుఁడు హరి
తప్పక విభుఁడయ్యుఁ దన్నుఁ, దా సృజియించున్.

భాగవతము 9 స్కం. 726 ప.

గుణరూపరహితుఁడై నపరమాత్మ లోకకల్యాణార్థమై సగుణ బ్రహ్మముగా నవతరించుచుండుట సుప్రసిద్ధము. ఆజగత్ప్రభుని లీలావతారమే శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులు. వీరి యవతారలక్షణములును, మహిమావిశేషములును, నాచే రచియింపఁబడిన "శ్రీ సుబ్రహ్మణ్యగురుస్వామి చరిత్ర" యందు విపులముగా వ్రాయఁబడినవి. కన్న తల్లిదండ్రులైనను జూపఁజాలని యపారప్రేమతో నన్నాదరించి దరిఁజేర్చి రక్షించిన శ్రీశ్రీశ్రీ బాపాంబా సుబ్రహ్మణ్యగురు దంపతులకు వినయ పూర్వకమగు నాప్రణామ సహస్రములు. ధ్యానసిద్ధలో నున్నపుడు కల్గిన నావాక్ప్ర సూనములచే గురుదేవు నర్చింపఁదలఁచి యీ శతకము రచించినాఁడను. సజ్జను లిందలి సారమునే గ్రహింతురని వేడుచున్నాను.

ఈ గ్రంథముద్రణమునకై ద్రవ్యమొసంగినట్టియు మునుకుట్ల వెంకటేశ్వర్లు గారి దత్తపుత్రులైనట్టియు నాకు బాల్యమిత్రులైనట్టియు, మునుకుట్ల విశ్వనాథం గారికి నాకృతజ్ఞతా వందనములు.

మకాం.
రాజమండ్రి
24—1—1948.

ఇట్లు సుజనవిధేయుఁడు
ఉభయభాషాప్రవీణ
లింగాల సూర్యనారాయణ
తెలుఁగు పండితుఁడు
S. M. H. M. School
వేగాయమ్మపేట
తూర్పుగోదావరి జిల్లా.

Scanned with CamScanner

# శ్రీ సుబ్రహ్మణ్య శతకము.

శ్రీ రఘువర నిజోత్సవ
కారణ గురుదేవభక్త ♦ కల్పద్రుమమా
గోరితి బ్రహ్మపథంబును
సూరి వినుత పూజ్యపాద! ♦ సుబ్రహ్మణ్యా! 1

క. శ్రీకరగుణ శ్రీరామునిఁ ♦ బ్రాకట శుభలీలఁ జూపఁ బరశివకళతో
నీకలియందునఁ బుట్టితి ♦ శోకహరణ దివ్యబోధ! సుబ్రహ్మణ్యా. 2

క. కామాదుల దరిఁజేరక ♦ యాముష్మికబోధఁజేయ నవనీస్థలిపైఁ
గామర్తి పురమునందున ♦ సోమునివలె వెలసినావు సుబ్రహ్మణ్యా. 3

క. ధరఁగల క్షేత్రములెల్లను ♦ బరికింపఁగ నీదు పాదపద్మయుగంబే
శరణంబయి గాన్పించెను ♦ సురగురుసమ దివ్యబోధ! సుబ్రహ్మణ్యా. 4

క. నరులీ కలియుగమందునఁ ♦ బరమాత్మను గానరనెడి భావముతోడన్
ధరలోన వెలసితివిగా ♦ సురశేఖర! శంభుదేవ! సుబ్రహ్మణ్యా. 5

క. గురువన నామము రూపము ♦ పరికింపఁగలేని శుద్ధవస్తువు గానన్
నరులను రక్షింపఁగ భూ ♦ సురుఁడవుగాఁ బుట్టినావ! సుబ్రహ్మణ్యా 6

క. గురువే తల్లియుఁ దండ్రియు ♦ గురువే మఱిదైవమనుచుఁ గోరికతోడన్
గురువే పరమనినమ్మితి ♦ సురపూజిత పాదపద్మ సుబ్రహ్మణ్యా. 7

క. సాధనలెఱుఁగని జనులకు ♦ బాధలు లేనట్టి బోధ బాగుగఁ జేయున్
సాధువుల హృదయములఁగని ♦ శోధించిన పుణ్యమూర్తి సుబ్రహ్మణ్యా

క. భక్తిగ గురువును గొల్చి, వి♦రక్తిగ విశ్వంబుఁ జూచి, రాముని గొలువన్
ముక్తినిఁ బొందెదవనుచును ♦ సూక్తులు బోధించినావు సుబ్రహ్మణ్యా.

క. క్షేత్రము దేహంబయ్యెను ♦ క్షేత్రజ్ఞుండాత్ముఁడయ్యె సేవింప నినున్
క్షేత్రములన్నిటి నడపెడి ♦ సూత్రధరుఁడవనుచుఁ గొల్తు సుబ్రహ్మణ్యా

Scanned with CamScanner

క. ఫాలమునందున జ్యోతియు ♦ నీలమునం దెఱుకమహిమ నేనేయనుచున్
మేలయిన తత్త్వమిచ్చిన ♦ శూలివనుచు నిన్నుఁగొలుతు సుబ్రహ్మణ్యా

క. ప్రజ్ఞానమె బ్రహ్మంబని ♦ యజ్ఞానముఁ బాఱఁద్రోలి యానందముతోన్
విజ్ఞానధనము నిచ్చిన ♦ సుజ్ఞానుఁడవనుచుఁ దలఁతు సుబ్రహ్మణ్యా 12

క. బాధలు కలిగించెడి పెను ♦ గాధలలోఁ జిక్కనీక కారుణ్యముతోన్
సాధకులగు నిజశిష్యుల ♦ శోధించితి వీవెగాదె! సుబ్రహ్మణ్యా 13

క. పరిపూర్ణాచలతత్త్వము ♦ ధరలో వ్యాపింపఁజేసి తత్త్వజ్ఞులచేఁ
గరుణామృత రసపానము ♦ సారిదిగఁ జేయించినావు సుబ్రహ్మణ్యా 14

క. ఏకంబై నిరతమును వి ♦ శోకంబై పంచభూత శూన్యంబగుచున్
జీకటి వెలుఁగుల నించుక ♦ సోకదఁగా నీదురూపు సుబ్రహ్మణ్యా 15

క. సుందరకాండను నిత్యము ♦ నందముగాఁ బూజసేయ నబ్బురముగ నా
డెందమునందున నిల్చిన ♦ సుందర తత్త్వస్వరూప! సుబ్రహ్మణ్యా 16

క. నేత్రములందున శ్రీగా ♦ యత్రినిఁ జూపించి మిగుల యానందముతోన్
గాత్రము లన్నిట నుండెడు ♦ సూత్రముసూచించినావు సుబ్రహ్మణ్యా

క. తీరముల మూటిపైనన్ ♦ సారంబై వెల్గుచున్న చక్కని జ్యోతిన్
జేరెడి మార్గము దెల్పితి ♦ సూరివినుత! సత్కవీంద్ర! సుబ్రహ్మణ్యా

క. క్రౌర్యంబించుక మెఱుఁగని ♦ యార్యులరక్షింపఁదలఁచి యానందముతోన్
నార్యావర్తాబ్జమునకు ♦ సూర్యుఁడవై వెలసినావు సుబ్రహ్మణ్యా 19

క. సోహమె యజహరిరుద్రులు ♦ సోహమె దేవాదిగణముసొంపుగఁ జూడన్
సోహమె భూతము లన్నియు ♦ సోహమెగా! నీవునేను సుబ్రహ్మణ్యా

క. సోహమె చక్రములన్నియు ♦ సోహమె చక్రంబులందు సురగణమెల్లన్
సోహమె బీజాక్షరములు ♦ సోహమె నీవనఁగఁ జెల్లు సుబ్రహ్మణ్యా 21

క. బయలే బ్రహ్మంబనుచును ♦ నయయుక్తుల బోధఁజేసి నారాయణునిన్
బయలందుఁ జూపినాఁడవు ♦ సుయశోనియమాదినిష్ఠ సుబ్రహ్మణ్యా

Scanned with CamScanner

క. కలఁ దోఁచిన చిత్రంబులు • మెలఁకువలో లేసియట్లు మేటిజగంబుల్
కలరీతి వేయటంచును • సులువుగ బోధించినావు సుబ్రహ్మణ్యా 23

క. నాపయి ప్రేమను జూపుచుఁ • బ్రాపుగ గురుబోధఁ జేసి బహుయుక్తులతోన్
జూపులయందలి చిత్రముఁ • జూపుచు రక్షించినావు సుబ్రహ్మణ్యా 24

క. గురుకాల మహిమలన్నియు • నిరతము నీవభ్యసించి నిశ్చలమతితోఁ
బరమును జేరుమటంచును • సురుచిని బోధించినావు సుబ్రహ్మణ్యా 25

క. పరమపదంబును గోరెడి • నరులకు గురుబోధఁ జేయ నరరూపముతో
ధరలోన వెలసితివిగా • సురనాయక! దివ్యతేజ! సుబ్రహ్మణ్యా 26

క. నిగమాదులు నీతత్త్వముఁ • బొగడంగను శక్తిలేక పోవుటచేతన్
మగతనము వీడియుండెను • సుగుణాకర! శంభురూప! సుబ్రహ్మణ్యా

క. తనువున లోకములన్నియుఁ • బనిగొని చూపించినాకుఁ బరమప్రీతిన్
మనసే పరమాత్మ యటం • చును దెల్పితివీవె తండ్రి! సుబ్రహ్మణ్యా

క. దేహమశాశ్వత మనుచును • దేహియె నిత్యుండు నాదిదేవుఁడని సం
దేహములన్నియు వీడఁగ • సోహము సూచించినావు సుబ్రహ్మణ్యా

క. క్షరమే దేహంబని య • క్షరుఁడే కూటస్థుఁడెఱుక సాక్షియనుచుం
బురుషోత్తముఁ డచలుండని • సురుచిరముగఁ దెల్పినావు సుబ్రహ్మణ్యా

క. సతతము మదిలోన శ్రీ • పతియగు శ్రీరామచంద్రుఁ బ్రార్థింపఁగ స
ద్గతిఁగల్గు నమ్ముమని య • చ్యుత తత్త్వము దెల్పినావు సుబ్రహ్మణ్యా

క. ఆకలిదప్పికలేకను • రాకడపోకడయులేక రాజిలుచుండున్
శోకము మోహము నించుక సోకదుగా నీదురూపు సుబ్రహ్మణ్యా 32

క. కాటుకపిట్టల లోపల • సూటిగఁ దిలకింప మిగుల సూక్ష్మంబగుచున్
మేటి జగంబుల కెల్లను • జోటైనది నీదురూపు సుబ్రహ్మణ్యా. 33

క. అచల సముద్రమునందున • సచరాచర జీవలోక జాలంబెల్లన్
బచరించు విధము దెల్పిన • సుచరిత దేవాదిదేవ! సుబ్రహ్మణ్యా. 34

Scanned with CamScanner

క. పరిపరివిధముల శిష్యుల ♦ దురితంబులనెల్లఁ బాఱఁదోలుచుఁగరుణన్
బరతత్త్వమిచ్చినాఁడవు ♦ సురనాయక! ఫాలనేత్ర! సుబ్రహ్మణ్యా 35

క. అతులిత వైరాగ్యమె స ♦ ద్గతినిచ్చునటంచుఁ బూర్ణకారుణ్యముతో
నతిగోప్య వస్తువిచ్చితి ♦ శ్రుతిగోచర దివ్యపాద! సుబ్రహ్మణ్యా. 36

క. పగడము స్ఫటికము కర్బుర ♦ మగు నీల సునీలమైన యంతరువులలోఁ
దగు స్వర్ణపీఠమందున ♦ సొగసుగ నిల్చితివి దేవ! సుబ్రహ్మణ్యా 37

క. పలికినఁ దేనెలుగురియును • గులికిన శ్రీరాముఁడెదుటఁగోదండముతో
నిలుచుచు నాట్యముసేయును • సులలిత నిన్నెన్నదరమె సుబ్రహ్మణ్యా

క. గగనాకారంబగుచును • నగణిత రూపంబులగుచు నంతయుఁ దానై
మిగులుచుఁ బ్రకృతికినెప్పుడు • సొగసైనది నీదురూపు సుబ్రహ్మణ్యా

క. పూతంబై సకల దిశా • తీతంబై సర్వలోక తీర్థంబై స
ద్గీతంబైనది యాత్మ • జ్యోతిగదా! నీదురూపు సుబ్రహ్మణ్యా 40

క. దేహమె దేవాలయమని • సోహమె దేవుండటంచు సూచించుచు సం
దేహము లణఁచుచుఁ గాచిన • సోహంబ్రహ్మస్వరూప! సుబ్రహ్మణ్యా

క. పుష్కరతీర్థమునందున • నిష్ఠలతో మెఱయుచున్న నిజమగుధనమున్
బుష్కళముగనిడి మెఱుకను • శుష్కింపఁగఁ జేసినావు సుబ్రహ్మణ్యా

క. ఆద్యంబయి నిగమాగమ • వేద్యంబయి గురుకటాక్ష వేద్యంబయి తా
నాద్యంత శూన్యమగుచును • జోద్యంబగు నీదురూపు సుబ్రహ్మణ్యా

క. పైలే విశ్వంబని లో • పైలే బ్రహ్మంబటంచు బహుయుక్తులతో
వాలాయంబుగఁ దెల్పితి • శూలాయుధ! నాగభూష! సుబ్రహ్మణ్యా

క. కన్నుసుమీ! నీరాజ్యము • వెన్నసుమీ! నీదుబోధ వివరింపంగా
మిన్నసుమీ! నీపాదము • సున్నసుమీ! ద్వయమునీకు సుబ్రహ్మణ్యా

క. సకలప్రాణులయందున • నొకరీతిగనాడి తర్కయుక్తులచేతన్
బ్రకటింపఁ దెలియకుందువు • సుకవిజనస్తోత్రపాత్ర! సుబ్రహ్మణ్యా 46

Scanned with CamScanner

క. కను పట్టణ చిత్రింబులు • పనిగొని చూపించినాఁకుఁ బరమప్రీతిన్
ఘనయోగవిద్య నొసఁగిన • సునిదర్శన రూపదేవ! సుబ్రహ్మణ్యా.

క. ప్రకటముగాకను గురు వాఁ • క్ప్రకటితమై వెలయుచున్న బ్రహ్మంబగునో
యకలంకరూప! కలియుగ • శుకయోగివటంచుఁ దలఁతు సుబ్రహ్మణ్యా

క. కాయంబునఁగల దేవు ను • పాయంబునఁ జూడనేర్పి బహుయుక్తులచే
హేయంబు నణఁచు నీదగు • సోయగమును బొగడఁదరమె సుబ్రహ్మణ్యా

క. తమ్ములనాటిట సురనివ • హమ్ములతోఁ గొల్వతీరి యచలముదానై
యిమ్మహిఁగల గురుపుత్రుల • సొమ్ముగదా! నీదురూపు సుబ్రహ్మణ్యా

క. భూతంబుల భూతేశుల • భూతస్థుల నిలుపఁజాలు పూర్ణాత్ముఁడవై
పాతకజాలం బణఁచెడి • జ్యోతికి స్థానంబునీవు సుబ్రహ్మణ్యా. 51

క. తాపత్రయాగ్నిఁ గ్రాఁగెడు • పాపాత్ములఁ జేరఁదీసి బ్రహ్మార్ణవమం
దేపున జలకం బార్చుచుఁ • జూపులలో వెల్గుదేవ! సుబ్రహ్మణ్యా.

క. ప్రచురంబగుచును బయలుగ • సచరాచరరూపమగుచు సర్వముతానై
యచల బ్రహ్మార్ణవమున • శుచిగాఁ గ్రీడించుస్వామి! సుబ్రహ్మణ్యా.

క. బాలునివలె నున్మత్తుని • పోలికగాఁ బ్రకృతివీడి పూర్ణాంబుధిలో
నోలలనాడుచునుందువు • శూలహస్త! యమృతదేహా! సుబ్రహ్మణ్యా

క. తలఁచిన దర్శనమిత్తువు • కొలిచినఁ దీర్చెదవుగాదె! కోరికలెల్లన్
గలియుగ భక్తజనావన • సులలితదేవాధిదేవ! సుబ్రహ్మణ్యా. ౫౫

క. శరణాగత బిరుదాంకిత! • పరమేశ్వర! దేశికేంద్ర! భావాతీతా
గుణిత్రోడ నిన్ను వేడెద • సురవర! నన్నేలుమయ్య సుబ్రహ్మణ్యా.

[చక్రములు]

క. నిజమగు వాసాంతపు పం • కజ పీఠమునందు నిలిచి కారుణ్యముతో
గజముఖుఁడవయితివీవెగ • సుజనవినుత! భక్తవరద! సుబ్రహ్మణ్యా

క. అతులిత శాలాంతంబగు • శతపత్రము నందుఁజేరి శాంతాత్ముఁడవై
చతురాసన నిను వేడెద • సుతు నన్నుం గావుమింక సుబ్రహ్మణ్యా.

క. అరయఁగ డాఫాంతంబగు • వరపద్మమునందుఁ జేరి వైకుంఠుఁడవై
హరి నిన్ను నమ్మియుంటిని • సురనాయక మోక్షమిమ్ము సుబ్రహ్మణ్యా

క. కీలిత కాఠాంతంబగు • మేలగు పద్మంబునందు మెలఁగిన నిన్నుం
బాలింప మిగుల వేడెద • శూలాయుధ! రుద్రదేవ! సుబ్రహ్మణ్యా.

క. కోమల షోడశదళయుత • తామరసంబునను జేరి దయతో నాత్మా
రాముఁడవై నెలకొంటివి • సోమార్ధకళాకిరీట సుబ్రహ్మణ్యా. 61

క. విదితంబుగ హంక్షంబగు • ద్విదళాబ్జమునందుఁ జేరి తేజోనిధివై
మదిని సదాశివుఁడంచును • సుదయాకర! నిన్ను గొల్తు సుబ్రహ్మణ్యా

క. అరుదగు వేయిదళంబుల • గురుపద్మమునందుఁ జంద్రకోటిప్రభతో
గురునారాయణ! నిలిచితి • సురవందిత పాదపద్మ! సుబ్రహ్మణ్యా.

క. ఖ్యాతిగ నాదిత్యాదుల • నాతతముగ వెలుఁగఁజేసి యాత్మయుఁదానై
పాతకహరమగు నాహో • జ్యోతి యగును నీదురూపు సుబ్రహ్మణ్యా.

క. నీల సరోవరమందున • మేలగు నొక తెల్లపూవు మెఱయుచునుండన్
వాలాయంబుగ నందున • సోలాడుచు రాజ్యమేలు సుబ్రహ్మణ్యా.

క. మందుసుమీ! భవరోగికిఁ • బొందుసుమీ! రాజయోగ పూర్ణాత్మునికిన్
విందుసుమీ! మునికోటికి • సుందరమగు నీదురూపు సుబ్రహ్మణ్యా.

క. నాదాతీతంబగుచును • వేదప్రతిపాద్యమగుచు వెలుఁగఁగలగనియా
భేదాభేదంబగు మధు • సూదనసఖ! నీదురూపు సుబ్రహ్మణ్యా.

క. గురుఁడే యొకపరబ్రహ్మయు • గురుఁడే మఱి విష్ణువగును గురుఁడే శివుఁడున్
గురుఁడే పరశివుఁడంచును • సురగురురూపములఁ జూపు సుబ్రహ్మణ్యా

క. సప్తావరణ పురంబున • గుప్తంబగు పీఠమందుఁ గోటిప్రభతో
దీప్తిగ రాజ్యం బేలుచు • సుప్తిని మేల్కొనిన స్వామి సుబ్రహ్మణ్యా.

Scanned with CamScanner

క. గురు కరుణాపాత్రుండగు, పరిపూర్ణ బ్రహ్మధనము భక్తుల కెల్లన్
మురిపెమ్మ గాగనిచ్చిన, సురనాయక! దివ్యదేహా! సుబ్ర॥ 70

క. పాపయగురు శిష్యుండవై, పాపాత్ముల నెల్లఁ బరమపదమును జేర్పన్
బ్రాపగు దివ్యామృతమును, జూపులలోఁ జూపుతండ్రి సుబ్ర॥ 71

క. ధ్యాన సరోవరమందలి, జ్ఞాన జలంబందుమునిఁగి సర్వజ్ఞుఁడవై
మానుగ వెలసినసన్నుఁ(బ్ర), సూనమ్ములఁ బూజసేతు సుబ్ర ॥72

క. పరమును గోరెడువారికి, గురుసేవయె ముఖ్యమని యకుంఠితభక్తిన్
బరిపరివిధములఁ దెల్పిన, సురవర! కైలాసవాస! సుబ్రహ్మణ్యా 73

క. ఖేచరి షణ్ముఖముద్రను, భూచరి శాంభవియటన్న ముద్రిలజ్యోతి
ర్వ్యచికలఁజూపి బ్రహ్మము, సూచించిన పుణ్యమూర్తి సుబ్రహ్మణ్యా

క. షోడశదళ పద్మంబను, మేడను నివసించి ప్రకృతిమీరిన కళతోఁ
గ్రీడించు యోగమూర్తీ, షోడశనామస్వరూప! సుబ్రహ్మణ్యా 75

క. అవధూతల మర్మంబుల, భువిలో వ్యాపింపఁజేయ మునివేషముతో
నవతారమంది, తత్త్వము, సువిదితముగఁ దెల్పినావు సుబ్రహ్మణ్యా

క. జాలంధ్రపీఠమందున, మేలుగ రాజ్యంబునేలి మెఱపులగనివై
వాలాయంబుగ నుంటివి, శూలాయుధ! దేశికేంద్ర సుబ్రహ్మణ్యా

క. జ్యోతిర్మయ లోకంబులు, నాతత భూమధ్యదేశమందేయని ప్ర
ఖ్యాతిగ గాథలుదెల్పిన, నూతనమౌనివనుచుఁదలఁతు సుబ్రహ్మణ్యా

క. తారకమే సగుణంబగుఁ, దారకమే నిర్గుణాత్మ తత్త్వంబనుచున్
దారకమే బ్రహ్మంబని, సూరులు మెచ్చంగఁదెల్పు సుబ్రహ్మణ్యా

క. సీతారాములచేతను, ఖ్యాతిగ నభిషేకమంది యాజ్ఞేయమునన్
బూతాత్ముఁడవయి వెలసిన, జ్యోతిర్లింగస్వరూప! సుబ్రహ్మణ్యా

క. నిష్కారణ హరిభజనమె, పుష్కరతీర్థంబుఁజేర్చుఁ బుత్రిడ!యనుచున్
నిష్కర్షగ నాయెఱుకను, తుష్టింపగఁజేసినావు సుబ్రహ్మణ్యా 81

క. మోహమె బంధంబని నిర్మోహ మెద్ది సురహితమైన మోక్షంబనుచున్
దేహమునందలి దేవుఁడు • సోహంబని తెల్పినావు సుబ్రహ్మణ్యా. 82

క. పల్లవపుష్పలతాతరు • వేల్లితసత్సర్వవర్ణ విలసితరాజ
త్కొల్లాటవీరమందిర • సోల్లాసవిహార దేవ ! సుబ్రహ్మణ్యా. 83.

క. త్రిగుణాతీతుఁడవగుచును • త్రిగుణాత్మప్రకృతివగుచుఁ దేజోనిధివై
జగములవలెఁ గాన్పింతువు • సుగుణాకర! విశ్వరూప! సుబ్రహ్మణ్యా.

క. ఆర్యసమాధులనాఱిటఁ • బర్యాయముగాఁగఁ దేలి బ్రహ్మమునీవై
తుర్యాతీతసమాధిని • సూర్యుఁడవై యుందువెపుడు సుబ్రహ్మణ్యా.

క. నాదాతీతంబగుచును • భేదాభేదంబునగుచుఁ బెద్దయుఁదానై
వేదాంతమగుచునుందువు • సూదినిలుపసందు లేక సుబ్రహ్మణ్యా. 86

క. భద్రాచలరూపుఁడవై • ముద్రాతీతుండవగుచు మునిజనపతివై
భద్రములనొసఁగుచుందువు • క్షుద్రములకలుషములఁ బాపి సుబ్రహ్మణ్యా.

క. చైతన్యగ్రహణంబే • సీతాగ్రహణంబటంచుఁ జెప్పుచుఁ గృపతో,
నాతతగుహలోననను • స్ఖ్యాతముగా నెల్గుదేవ ! సుబ్రహ్మణ్యా. 88

క. గురుసేవా ధర్మంబులు • గురుముద్రాలక్షణమును గురుమర్మంబుల్
గురుపాదతీర్థమహిమను • సరిదిగ బోధించినావు సుబ్రహ్మణ్యా. 89

క. ఆనందాతీతము ప్ర • జ్ఞాననిధానంబు బ్రహ్మ సౌధంబది నీ
లోనన్ గనుగొనుమనుచు య • శోనిధవై తెల్పినావు సుబ్రహ్మణ్యా.

క. నిత్యంబై కాలత్రియ • సత్యంబై సర్వలోక సౌఖ్యకరంబై
ప్రత్యక్షమైన సర్వము • స్తుత్యంబగు నిన్నుఁ జెంది సుబ్రహ్మణ్యా 91

క. నిదురను మేల్కొనిచూచిన • నెదుటనె ప్రత్యక్షమగుచు నేకార్ణవమై
గదలక దర్శనమిత్తువు • సుదయాకర ! యచలరూప ! సుబ్రహ్మణ్యా.

క. ముక్కుతుద బయలునందున • దృక్కులు సిగిడించి తేట తెల్లముగాగన్
జక్కని తేజోనిధిలోఁ • జొక్కుచు జపియించుస్వామి ! సుబ్రహ్మణ్యా.

Scanned with CamScanner

క. తామసగుణమోహితుఁడై, కామాదులఁజిక్కియున్నకలుషాత్మునికిన్
నీమాయదాటశక్యమె! సోమార్ధకలాకిరీట! సుబ్రహ్మణ్యా. 94

క. బుద్ధంబై కాలత్రయ, శుద్ధంబై సర్వలోక పుణ్యాకరంబై
శ్రద్ధాసిద్ధంబగుచును, శుద్ధికరము నీకురూపు సుబ్రహ్మణ్యా. 95

క. క్షేత్రంబీశ్వరుఁడయ్యెను, క్షేత్రజ్ఞుఁడుబ్రహ్మమయ్యె సేవింపనినున్
క్షేత్రక్షేత్రజ్ఞుఁడవగునో, సూత్రధరా! నిన్నుఁ గొల్తుసుబ్రహ్మణ్యా.

క. కపటంబించుక యెఱుఁగని, జపయోగుల లక్ష్యమైన స్థానంబగునీ
యపరిమితబ్రహ్మంబే, సుపథంబని దెల్పుతండ్రి సుబ్రహ్మణ్యా. 97

క. అగుణబ్రహ్మమవయ్యును, జగముల రక్షింపనెంచి సగుణుఁడవగుచున్
భగవంతుఁడవై వెలసిన, సుగుణాకర! నిన్నుఁగొల్తు సుబ్రహ్మణ్యా.

క. ఒకపరిరాముఁడవగుచును, నొకపరి దేవీస్వరూప యుక్తుఁడవయినీ
వొకపరి తేజంబగుదువు, సుకవీశ్వర! చంద్రమౌళి! సుబ్రహ్మణ్యా.

క. తత్తరపడకుమటంచును, నుత్తమమార్గములఁజూపియుత్సాహముతో
నుత్తరసాంఖ్యమె నిజమగు, సొత్తనిబోధించినావు సుబ్రహ్మణ్యా. 100

క. మాహేంద్రవాడపురజన, మోహాదులఁద్రుంపనెంచిమునివేషముతో
గేహమునవిల్చియుంటివి, సోహంబ్రహ్మస్వరూప! సుబ్రహ్మణ్యా.

క. శమదమనియమాదులతో, విమలంబగుబ్రహ్మమగుచువిశ్వాత్ముఁడవౌ
కమనీయమూర్తి! నిసుద్ర, కుసుమములతోఁబూజసేతుసుబ్రహ్మణ్యా.

క. పతితజనోద్ధారణకై, నతులితశ్రీరామతత్త్వమవనీస్థలిలో
వితరణముఁజేయఁగా నీ, శ్రుతమైనది నీదుకీర్తి సుబ్రహ్మణ్యా. 103

క. గురుసేవానిరతుండై, దరిఁజేరినభక్తునవభృ, ధన్నాతునిగాఁ
గరుణింతువెపుడు చూచిన, సురవందితపాదపద్మ! సుబ్రహ్మణ్యా.

క. సకల చరాచరగణముల, నొకరీతిగరాముఁజూపి యుల్లాసముతో
నొకరీతినుందువెప్పుడు, సుకృతబంగు నిన్నుఁజూడ సుబ్రహ్మణ్యా.

Scanned with CamScanner

క. గురుకరుణాపాత్రుఁడనై • గురుదక్షిణ నీయఁదలఁచి కోరికతోడన్
విరచించితి నీశతకము • సురుచిరముగ స్వీకరింపు సుబ్రహ్మణ్యా. 106

క. అతిభక్తిశ్రద్ధల నీ • శతకంబున్వ్రాసి, మిగుల సంతోషముతో
నుతిసేయుచుందు నెప్పుడు • సుతునన్నుఁదరింపఁజేయు సుబ్రహ్మణ్యా.

క. సతతము నిన్ దలఁచుచు నీ • శతకము చదువంగనేర్చు సంసారులకున్
మితిలేని భాగ్యమబ్బును • స్తుతిపాత్ర!జగన్నివాస!సుబ్రహ్మణ్యా. 108

## గద్యము

ఇది శ్రీ శ్రీ శ్రీ సుబ్రహ్మణ్యనామకాస్మద్గురు కరుణా
కటాక్షలబ్ధకవితా విశేష భారద్వాజసగోత్ర పవిత్ర
కాత్యాయనసూత్ర మంగమాంబా వెంకన్న
శర్మపుత్ర లింగాల సూర్యనారాయణ
ప్రణీత శ్రీ సుబ్రహ్మణ్య శతకము
సంపూర్ణము
శ్రీ శ్రీ శ్రీ

## శ్రీ రామచంద్ర గ్రంథమాలా ప్రచురణకు ఇప్పటికి ద్రవ్యదాతలు:

మహారాజశ్రీ కరిరి నారయ్యగారు, మహేంద్రవాడ;

,, ముళ్ళపూడి గంగరాజుగారు, రాయవరం;

,, డాక్టరు కందర్ప సూర్యనారాయణగారు, బి. ఏ., మండపేట;

,, లింగాల సూర్యనారాయణగారు, (క్లార్కు. పి. డబ్ల్యు. డి. రిటైర్డు) } మకాం, అవిడి;

,, మునుకుట్ల విశ్వనాథంగారు, (వెంకటేశ్వర్లుగారి దత్తపుత్రులు) } దువ్వ;

,, రెడ్డి నాగభూషణమ్మగారు, దువ్వ.

Scanned with CamScanner

# శ్రీ రామచంద్ర గ్రంథమాలలో వెలకు దొరకు గ్రంథములు.

## శ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురుకృతములు

| | | | | |
|---|---|---|---|---|
| 1. | అచలపర వాసుదేవ శతకము (సగుణ, నిర్గుణ, శుద్ధ నిర్గుణ తత్త్వములను చక్కగా బోధించు గ్రంథరాజము | 1 | 8 | 0 |
| 2. | ఆత్మబోధ (సంస్కృతమునకు తెలుగు) | 0 | 10 | 0 |
| 3. | దండకమంజరి | 0 | 2 | 0 |
| 4. | శ్రీ సద్గురు స్తవరాజము (శ్రీ కూచి సత్యనారాయణశాస్త్రి కవీంద్ర కృతము) | 1 | 8 | |
| 5. | శ్రీ సుబ్రహ్మణ్య గురుపూజా విధానమ్ (రచయిత : ఉభయ భాషాప్రవీణ లింగాల సూర్యనారాయణ) | 0 | [illegible] | 0 |
| 6. | శ్రీ సుబ్రహ్మణ్య శతకము. | 0 | 3 | 0 |

అచ్చుకు సిద్ధముగా నున్నవి. (రెడ్డి వెంకటసుబ్రహ్మణ్య గురుకృతములు)

7. అద్వైత రహస్యము
8. మానస బోధ
9. గాయత్రీ నాటకము
10. ఎలుకలపాప చరిత్ర
11. అచల బ్రహ్మానంద ప్రబోధము
12. శ్రీరామనామ మంత్రావళి
13. స్వేచ్ఛానంద గీత
14. శ్రీరామ శతకము
15. సద్గురు బోధామృతము
16. విజ్ఞానామృతము
17. అష్టకమంజరి
18. సత్యనారాయణ వ్రతము
19. అచలస్థ విజ్ఞాన జనార్దనార్థ శతకము


20. శ్రీ సుబ్రహ్మణ్య గురుస్వామి చరిత్ర
21. శ్రీ సుబ్రహ్మణ్య గురుస్వామి సగుణబోధ

} రచయిత : ఉభయభాషాప్రవీణ లింగాల సూర్యనారాయణ.

వెలయువారు :—

రెడ్డి వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మం అండ్ సన్సు,

మహేంద్రవాడ, రామచంద్రపురం తాలూకా, తూ॥ గో॥ జిల్లా.



చరిత్ర రచయిత :

ఉభయభాషా ప్రవీణ : లింగాల సూర్యనారాయణ